# ముఖ్యమంత్రి కార్యాలయము

## తెలంగాణ ప్రభుత్వం

పత్రికా ప్రకటన-1 7, అక్టోబరు, 2014

రాష్ట్రంలో కొత్తగా విద్యార్థులకు ఆదాయ, కుల, నివాస ధృవీకరణ పత్రాలు ఇవ్వాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు నిర్ణయించారు. ఈ నెల 15 లోగా రుణమాఫీ పథకాన్ని వంద శాతం అమలు చేయాలని, బ్యాంకర్లతో ప్రతిరోజు సమావేశాలు, సమీక్షలు నిర్వహించి రైతులకు కొత్తగా రుణాలు అందేలా చూడాలని కలెక్టర్లను ఆదేశించారు. ఆహార భద్రత చట్టం ప్రకారం నిరుపేదలందరికి నిత్యావసర సరుకులు అందించేందుకు తెలంగాణ స్టేట్ ఫ్యామిలీ ఫుడ్ సెక్యూరిటీ కార్డులు ఇవ్వాలని నిర్ణయించారు. పెంచిన పెన్షన్ సొమ్మును కూడా నవంబర్‌లో అందించనున్నట్లు ప్రకటించారు.

సచివాలయంలో మంగళవారం వివిధ శాఖల కార్యదర్శులు, జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో ముఖ్యమంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. కొత్తగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రం పేరుతో విద్యార్థులకు కావలసిన సర్టిఫికేట్లన్నీ ఒకేసారి ఇవ్వాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. తెలంగాణ విద్యార్థుల కోసం ప్రవేశపెట్టిన ఫాస్ట్ పథకంలో లబ్ది కోరేవారు ఈనెల 15వ తేది లోగా సర్టిఫికెట్ల కోసం తహశిల్దారు (ఎంఆర్ఓ) కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. తహశిల్దారులు (ఎంఆర్ఓ) ఆ దరఖాస్తులను పరిశీలించి నెలాఖరులోగా సర్టిఫికెట్లు అందించాలని చెప్పారు.

తెలంగాణ రాష్ట్రంలో వృద్దులు, వికలాంగులు, వితంతువులకు కూడా పెన్షన్లు పెంచామని వాటిని కూడా నవంబర్ నెల నుండే అందించాలని ముఖ్యమంత్రి చెప్పారు. పెన్షన్లు కావలసిన వారు తమ దరఖాస్తులను అక్టోబర్ 15 లోగా విఆర్ఓలకు అందించాలని, తెల్ల కాగితం మీద పూర్తి వివరాలతో దరఖాస్తు రాస్తే సరిపోతుందని ముఖ్యమంత్రి చెప్పారు. విఆర్ఓలు ఆ దరఖాస్తులన్నింటిని తహశిల్దారు కార్యాలయంలో ఇవ్వాలని, తహశిల్దారు ఆధ్వర్యంలో వాటిని పరిశీలించి అర్హులకు పెన్షన్ అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పెన్షన్ మంజూరైన వారందరికి ప్రభుత్వం తరపున ప్రత్యేకంగా సాంక్షన్ లెటర్ రాయాలని కూడా ముఖ్యమంత్రి నిర్ణయించారు. వికలాంగులకు సదరం సర్టిఫికెట్లు మంజూరు

చేయడం కోసం ఏరియా ఆసుపత్రులలో ప్రత్యేక శిబిరాలు నిర్వహించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

అక్టోబర్ 15 లోగా పంట రుణాల మాఫీ కార్యక్రమాన్ని పూర్తి స్థాయిలో అమలు చేయాలని ముఖ్యమంత్రి కలెక్టర్లను కోరారు. బ్యాంకర్లకు చెల్లించాల్సిన మొదటి విడత సొమ్ము రూ. 4250 కోట్లు ఇప్పటికే బ్యాంకులకు అందాయన్నారు. కాబట్టి రైతులు కొత్తగా రుణాలు పొందేందుకు మార్గం సుగమం అయ్యిందని వెల్లడించారు. ప్రతిరోజు బ్యాంకర్లతో సమావేశం నిర్వహించి ప్రతిరైతు కొత్తగా రుణం పొందేలా చూడాలన్నారు.

తెలంగాణ రాష్ట్రంలో దారిద్ర్యరేఖకు దిగువన వున్న పేదలందరికి నిత్యావసర సరుకులు అందించేందుకు తెలంగాణ స్టేట్ ఫ్యామిలీ ఫుడ్ సెక్యూరిటీ కార్డులు ఇవ్వనున్నట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. ప్రభుత్వ ఉద్యోగం వున్నవారు, 5 ఎకరాలకు పైగా భూమి వున్నవారు, వ్యాపారవేత్తలను మినహాయించి మిగతా పేదలందరికి ఈ కార్డులు అందించాలని చెప్పారు. ఈ నెల 15 లోగా ఫుడ్ సెక్యూరిటీ కార్డు కోసం విఆర్ఒలకు దరఖాస్తు చేసుకోవాలని, విఆర్ఓలు ఈ దరఖాస్తులను గ్రామాల వారిగా విభజించి ఎంఆర్ఓ కార్యాలయంలో అందించాలని చెప్పారు. గ్రామాలలో లబ్ధిదారులను గుర్తించేందుకు అధికారులు క్షుణ్ణంగా పరిశీలన జరపాలని చెప్పారు. తప్పులు దొర్లితే సదరు అధికారి బాధ్యత వహించాల్సి వస్తుందని కూడా వెల్లడించారు. నిరుపేద కుటుంబంలోని ప్రతి ఒక్కరికి 5 కిలోల చొప్పున బియ్యం అందించడానికి సిఎం సూత్రప్రాయంగా అంగీకరించారు. లబ్ధిదారుల ఎంపిక కూడా ఈ నెలాఖరులోగా పూర్తి కావాలని చెప్పారు. జాతీయ ఆహార భద్రత చట్టం ప్రకారం తెలంగాణ రాష్ట్రంలో నిరుపేదలకు బియ్యం అందించనున్నట్లు వెల్లడించారు. ఫుడ్ సెక్యురిటీ కార్డు కేవలం నిత్యావసర సరుకులు తీసుకోవడానికి మాత్రమే ఉపయోగపడుతుందని, గతంలోని రేషన్ కార్డు మాదిరిగా అన్ని పథకాలకు దీనితో సంబంధం లేదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

ఎంఆర్ఓ కార్యాలయంలో దరఖాస్తులు స్వీకరించేందుకు ఇద్దరు రెవిన్యు అధికారులను కేటయించాలని కూడా కలెక్టర్లకు ముఖ్యమంత్రి చెప్పారు.

ఫుడ్ సెక్యూరిటీ కార్డు, పెన్షన్ కోసం లబ్ధిదారుల ఎంపిక, పెన్షన్ దారుల గుర్తింపు తదితర కార్యక్రమాలన్నీ తహశిల్దారుల పర్యవేక్షణలో జరగాలని, డివిజన్ల వారిగా ఫ్లయింగ్

స్క్వాడ్‌లను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి చెప్పారు.  పై కార్యక్రమాల్లో లబ్దిదారులను ఎంపిక చేసే క్రమంలో ఏమైనా ఇబ్బందులు తలెత్తితే ఫ్లయింగ్ స్క్వాడ్‌లో వున్న అధికారులు పరిష్కరిస్తారని, ఇందుకోసం హెల్ప్‌లైన్ కూడా ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి చెప్పారు.

ఇటీవల నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వే ప్రకారం ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలోని కుటుంబాల సమగ్ర స్వరూపాన్ని తెలుసుకున్నదని ముఖ్యమంత్రి చెప్పారు. సర్వేలో వచ్చిన వివరాలపై మరోసారి పరిశీలన కూడా జరిపి అధికారికంగా ప్రకటించాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. తెలంగాణలోని పౌరులకు ప్రత్యేక గుర్తింపు కార్డు ఇవ్వాలని కూడా ముఖ్యమంత్రి ఆదేశించారు.

సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాజీవ్ శర్మ, సిఎంఓ ముఖ్య కార్యదర్శి ఎస్.నర్సింగ్‌రావు, వివిధ శాఖల కార్యదర్శులు నాగిరెడ్డి, రేమాండ్ పీటర్, పూనం మాలకొండయ్య, పార్ధసారధీ, బిపి.ఆచార్య, రాజా, జోషి, కలెక్టర్లు రాహుల్ బొజ్జా, శ్రీధర్, జి.కిషన్, ఇలంబర్తి, చిరంజీవులు, ప్రియదర్శిని, రోనాల్డ్ రోస్, జగన్మోహన్, వీరబ్రహ్మయ్య, స్మితా సబర్వాల్, జాయింట్ కలెక్టర్లు, ఇతర అధికారులు  పాల్గోన్నారు.

---

సిపిఆర్ఓ టు సిఎం